
# రామ్‌చరణ్ సినిమాకు రెహమాన్ స్వరాలు





రామ్‌చరణ్ కథానాయకుడిగా 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సాన దర్శకత్వంలో పాన్ ఇండియా చిత్రం తెరకెక్కబోతున్న విషయం తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్, సుకుమార్ రైటింగ్స్ పతాకాలపై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. క్రీడా నేపథ్యంలో భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నట్లు తెలుస్తున్నది. అత్యున్నత సాంకేతిక హంగులతో రూపుదిద్దుకోనున్న ఈ చిత్రానికి ప్రముఖ సంగీత దర్శకుడు ఏ.ఆర్.రెహమాన్ స్వరాలను సమకూర్చబోతున్నారు. శనివారం ఏ.ఆర్.రెహమాన్ జన్మదినోత్సవం సందర్భంగా ఈ విషయాన్ని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. యూనివర్సల్ అప్పీల్ కలిగిన కథాంశమిదని, ఏ.ఆర్.రెహమాన్ సంగీతం సినిమాను మరో స్థాయికి తీసుకెళ్తుందని, ఈ సినిమా నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలో తెలియజేస్తామని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సమర్పణ: మైత్రీ మూవీ మేకర్స్, రచన-దర్శకత్వం: బుచ్చిబాబు సాన.

# నవ్విస్తూనే భయపెడుతుంది



'గీతాంజలి' నా కెరీర్‌లో తొలి హీరోయిన్ ఓరియెంటెడ్ మూవీ. పదేళ్ల క్రితం విడుదలైన ఆ సినిమా చాలా పెద్ద హిట్టయ్యింది. ఇప్పుడు అదే నమ్మకంతో 'గీతాంజలి మళ్లీ వచ్చింది' చేశా. ఈ సీక్వెల్‌లో విజువల్స్ మరో స్థాయిలో ఉంటాయి' అని చెప్పింది అంజలి. ఆమె టైటిల్ పాత్రలో నటిస్తున్న హారర్ కామెడీ ఎంటర్‌టైనర్ 'గీతాంజలి మళ్లీ వచ్చింది'. రచయిత కోన వెంకట్ సమర్పణలో ఎంవీవీ సత్యనారాయణ, జీవీ నిర్మిస్తున్నారు. శివ తుర్లపాటి దర్శకుడు. శనివారం ఈ సినిమాలోని క్యారెక్టర్స్‌ను పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అంజలి మాట్లాడుతూ 'సీక్వెల్‌లో ఎక్కువ తారాగణం కనిపిస్తుంది. ఆలీ, సునీల్, సత్య, శ్రీనివాస్ రెడ్డి, శకలక శంకర్ బాగా నవ్విస్తారు. గీతాంజలి ముద్దుగా కనిపించినా తను చేసే పనులు మాత్రం భయపెడతాయి' అని చెప్పింది. ఈ సీక్వెల్ చేయడానికి పదేళ్లు పట్టిందని, ఊటీ నేపథ్యంలో ఆద్యంతం వినోదంతో అందరి అంచనాలను అందుకుంటుందని, సంక్రాంతికి టీజర్‌ను విడుదల చేస్తామని సమర్పకుడు కోన వెంకట్ అన్నారు. సీక్వెల్‌కు మంచి టీమ్ కుదిరిందని దర్శకుడు తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: సుజాత సిద్ధార్థ్, సంగీతం: ప్రవీణ్ లక్కరాజు, కథ: కోన వెంకట్, నిర్మాణ సంస్థలు: ఎంవీవీ సినిమా, కోన ఫిల్మ్ కార్పొరేషన్, దర్శకత్వం: శివ తుర్లపాటి.



# లాయర్ పాత్రలో నాగార్జున?



కథాంశాల పరంగా ప్రయోగాలు చేయడంలో, ఇండస్ట్రీలో నూతన ప్రతిభను ప్రోత్సహించడంలో ఎప్పుడూ ముందుంటారు అగ్ర హీరో నాగార్జున. సుదీర్ఘ కెరీర్‌లో ఆయన ఎంతో మంది కొత్త దర్శకులను పరిశ్రమకు పరిచయం చేశారు. తాజా చిత్రం 'నా సామిరంగ' ద్వారా కొరియోగ్రాఫర్ విజయ్ బిన్నీని డైరెక్టర్‌గా ఇంట్రడ్యూస్ చేస్తున్నారు. ఇదిలావుండగా నాగార్జున..సుబ్బు అనే మరో నూతన దర్శకుడితో సినిమా చేయబోతున్నట్లు తెలిసింది. యదార్థ ఘటనల ఆధారంగా తయారుచేసుకున్న ఈ కథ నాగార్జునకు బాగా నచ్చిందని, కోర్ట్‌రూమ్ డ్రామా నేపథ్యంలో కథ నడుస్తుందని సమాచారం. సమకాలీన సామాజికాంశాలను చర్చిస్తూ చక్కటి సందేశం ఉన్న ఈ సినిమాలో నాగార్జున లాయర్ పాత్రలో కనిపిస్తారని తెలుస్తున్నది. త్వరలో ఈ చిత్రానికి సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. నాగార్జున తాజా చిత్రం 'నా సామిరంగ' సంక్రాంతి కానుకగా ఈ నెల 14న ప్రేక్షకుల ముందుకురానుంది.

# ఓషో పాత్రలో నటించాలనుంది!



ఎటువంటి పాత్రలోనైనా చక్కగా ఒదిగిపోతారు విలక్షణ నటుడు నవాజుద్దీన్ సిద్ధిఖీ. దేశవ్యాప్తంగా ఆయనకు అభిమానులున్నారు. 'సైంధవ్' చిత్ర ద్వారా ఈ వెర్సటైల్ యాక్టర్ తెలుగు చిత్రసీమలోకి అడుగుపెడుతున్నారు. వెంకటేష్ కథానాయకుడిగా శైలేష్ కొలను దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో నవాజుద్దీన్ సిద్ధిఖీ ప్రతినాయకుడి పాత్రను పోషించారు. ఈ నెల 13న 'సైంధవ్' విడుదలకానుంది. ఈ సందర్భంగా నవాజుద్దీన్ సిద్ధిఖీ శనివారం పాత్రికేయులతో ముచ్చటించారు. ఆ విశేషాలివి..

తెలుగులో నటించాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నా. అది 'సైంధవ్'తో కుదిరింది. ప్రతి నటుడు గొప్ప కథ కోసం ఎదురుచూస్తాడు. ఇదీ అలాంటి కథనే. ఫ్యామిలీ ఎమోషన్స్‌తో ప్రతీ ఒక్కరిని కట్టిపడేస్తుంది. ఇక ఓ నటుడిగా నేను విలన్, హీరో పాత్రలు అంటూ వేరుగా చూడను. నా పాత్రలో ఆసక్తికరమైన అంశాలుంటే చాలు..వెంటనే అంగీకరిస్తా. కొన్నిసార్లు నెగెటివ్ రోల్స్‌లోనే బెస్ట్ పర్‌ఫార్మెన్స్ కనబరిచే అవకాశం దక్కుతుంది. గతంలో బాలీవుడ్‌లో నేను విలన్ రోల్స్ చేశాను. 'సైంధవ్'లో నా క్యారెక్టర్‌ను మరింత కొత్తగా డిజైన్ చేశారు. తెలుగులో నా పాత్రకు నేనే డబ్బింగ్ చెప్పుకున్నా. సొంతంగా డబ్బింగ్ చెప్పినప్పుడే పాత్రకు న్యాయం జరుగుతుందని భావిస్తాను. తెలుగు భాషను, భావాలను అర్థం చేసుకొని డబ్బింగ్ చెప్పాను.

### కొత్త విషయాలు నేర్చుకున్నా

వెంకటేష్ వంటి సీనియర్ నటుడితో తెరను పంచుకోవడం గ్రేట్ ఎక్స్‌పీరియన్స్. ఆయనకు ఓర్పు చాలా ఎక్కువ. ఎప్పుడూ ప్రశాంతగా కనిపిస్తారు. ఆయన నుంచి చాలా విషయాలు నేర్చుకున్నా. ఈ సినిమాలో యాక్షన్ సీన్స్ చేయడం కొంచెం కష్టంగా అనిపించింది. పోరాట ఘట్టాలు మరో స్థాయిలో ఉంటాయి. ఈ సినిమా కోసం దాదాపు 40 రోజులు పనిచేశాను. తెలుగు ప్రేక్షకులు నా నటనను ఇష్టపడతారనే నమ్మకం ఉంది. ఆధ్యాత్మిక గురువు ఓషో పాత్రలో నటించాలన్నది నా డ్రీమ్. అవకాశం వస్తే ఆయన బయోపిక్‌లో నటిస్తా.

# నారా రోహిత్ రొమాంటిక్ చిత్రం



''ప్రతినిధి-2' ద్వారా సినిమాల్లో రీఎంట్రీ ఇస్తున్నారు నారా రోహిత్. తాజాగా ఆయన నటిస్తున్న 20వ చిత్రం శనివారం పూజా కార్యక్రమాలతో మొదలైంది. వెంకటేష్ నిమ్మలపూడి దర్శకత్వంలో సందీప్ పిక్చర్ ప్యాలెస్ పతాకంపై సంతోష్ చిన్నపోల్ల, గౌతమ్ రెడ్డి, రాకేష్ మహంకాళి నిర్మిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి గౌతమ్‌రెడ్డి క్లాప్‌నిచ్చారు. 'ఈ రోజు రెగ్యులర్ షూటింగ్ మొదలుపెడుతున్నాం. రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ ఇది. నారా రోహిత్ పాత్ర కొత్త పంథాలో ఉంటుంది' అని చిత్ర బృందం పేర్కొంది. విర్తి వాఘని, శ్రీదేవి విజయ్ కుమార్, నరేష్ విజయకృష్ణ, వాసుకి ఆనంద్ తదితరులు ముఖ్య పాత్రలను పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ప్రదీప్ ఎం వర్మ, సంగీతం: లియోన్ జేమ్స్, ఆర్ట్: రాజేష్ పెంటకోట, రచన-దర్శకత్వం: వెంకటేష్ నిమ్మలపూడి.

# మీకే అంతుంటే.. మాకెంతుంటుంది!



నాగచైతన్య, సాయిపల్లవి నాయకానాయికలుగా తెరకెక్కుతున్న చిత్రం 'తండేల్'. అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై బన్నీ వాసు నిర్మిస్తున్న ఈ సినిమాకు చందూ మొండేటి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రం కర్ణాటకలో షూటింగ్ జరుపుకుంటున్నది. 'తండేల్' సారాంశాన్ని వివరించే ప్రయత్నంలో తాజాగా గ్లింప్స్ రిలీజ్ చేశారు. చేపలు పట్టడానికి సముద్రంలోకి వెళ్లిన నాగచైతన్య పాత్ర 'రాజు'ను పరిచయం చేస్తూ ప్రారంభమయ్యే గ్లింప్స్‌లో 'ఈ పాలి యేట.. గురి తప్పేదే లేదేస్.. ఇక రాజులమ్మ జాతరే' అని చైతూ చెప్పిన మాస్ డైలాగ్ ఆకట్టుకుంది. తోటి జాలర్లతో అనుకోకుండా పాకిస్తాన్ జలాల్లోకి జాలరి రాజు ప్రవేశిస్తే కరాచీ సెంట్రల్ జైల్‌లో బంధించి కఠిన శిక్షలు అమలు చేస్తారు. జాతీయవాదాన్ని ప్రశ్నించిన జైలర్‌కు 'మా నుండి ఊడిపోనా ఒక ముక్క.. మీకే అంతుంటే ఆ ముక్క ముష్టేసిన మాకెంతుంటుంది.. భారత్ మాతాకీ జై' అని నాగచైతన్య సమాధానమిచ్చిన తీరు అందరిలో దేశభక్తిని ప్రేరేపించేలా ఉంది. రాజు ప్రేమికురాలిగా సాయిపల్లవి పోషించిన బుజ్జితల్లి పాత్ర చిత్రణ తీరు ఈ గ్లింప్స్‌తో తెలిసింది. గతానికి భిన్నంగా చైతూ రస్టిక్ అవతారంలో కనిపించారు. శ్రీకాకుళం యాసను బాగా పలికారాయన.

# దేనికైనా టైమ్ రావాలి



సినీరంగంలో అవకాశాలను అందిపుచ్చుకొని విజయాలు సాధించడం అంత సులభం కాదు. ఎన్నో విఫల యత్నాలు ఎదురైతేకానీ కోరుకున్న సక్సెస్ దొరకదు. కెరీర్ ఆరంభంలో దర్శకుడు సందీప్‌రెడ్డి వంగాకు అలాంటి అనుభవాలే ఎదురయ్యాయట. విజయ్‌దేవరకొండతో ఆయన తీసిన 'అర్జున్ రెడ్డి' ఓ కల్ట్‌మూవీగా నిలిచిపోయిన విషయం తెలిసిందే. తొలుత ఈ చిత్రాన్ని అల్లు అర్జున్ హీరోగా తెరకెక్కించాలని అనుకున్నాడట సందీప్ రెడ్డి. అయితే ఆయన్ని కలిసే అవకాశం రాకపోవడంతో విజయ్ దేవరకొండతో ఆ సినిమా తీశానని చెప్పాడు. 'యానిమల్' బ్లాక్‌బస్టర్ విజయంతో దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా జోష్ మీదున్నారు. ఈ సందర్భంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ '2011లోనే అల్లు అర్జున్‌కు ఓ కథ చెప్పాను. అనివార్య కారణాల వల్ల ఆ ప్రాజెక్ట్ కార్యరూపం దాల్చలేదు. అనంతరం 'అర్జున్ రెడ్డి' కథను అల్లు అర్జున్‌కు చెప్పాలనుకున్నా. కానీ ఆయన్ని కలిసే వీలులేకుండా పోయింది. ఓ కామన్ ఫ్రెండ్ ద్వారా విజయ్ దేవరకొండ పరిచయమం కావడంతో ఆయనతో ఆ సినిమా తీశాను. దాదాపు 13 ఏండ్ల విరామం తర్వాత అల్లు అర్జున్‌తో కలిసి పనిచేసే అవకాశం దక్కింది. దేనికైనా టైమ్ రావాలి' అని చెప్పారు. ప్రభాస్ హీరోగా సందీప్ రెడ్డి వంగా 'స్పిరిట్' చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారు. దీని తర్వాత అల్లు అర్జున్ సినిమా పట్టాలెక్కనుంది.

# చూపుల వలలో చిక్కేదెవరు?



'అర్జున్‌రెడ్డి' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు 'ప్రీతి'గా సుపరిచితురాలు షాలినీ పాండే. ఈ ఉత్తరాది బ్యూటీ తన తొలిచిత్రంతోనే కుర్రకారు గుండెల్ని కొల్లగొట్టింది. తనదైన నటనా పాటవాన్నీ ప్రదర్శించిది. 'మహానటి', 'ఎన్టీఆర్ కథానాయకుడు' వంటి సినిమాల్లో కొన్నిప్రత్యేక పాత్రలు పోషించింది. '100% లవ్'కి రీమేక్‌గా వచ్చిన '100% కాదల్'తో ఈ అమ్మడు తమిళ చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టింది. '118'లో కళ్యాణ్‌రామ్‌తో, 'ఇద్దరిలోకం ఒకటే'లో రాజ్ తరుణ్‌తో రొమాన్స్ చేసినప్పటికీ ఎప్పుడూ టాప్ లీగ్‌లోకి రాలేకపోయింది. 'గొరిల్లా', 'సైలెన్స్' వంటి సినిమాలు ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోవడంతో ఆమెకు తమిళంలోనూ అదే పరిస్థితి ఎదురైంది. రణ్‌వీర్‌సింగ్ హీరోగా హిందీలో 'జయేష్ భాయ్ జోర్దార్'తో తన కెరీర్ టేకాఫ్ అవుతుందని ఆమె అంచనా వేసింది. యష్ రాజ్ ఫిల్మ్ నిర్మించిన ఈ సినిమా డిజాస్టర్‌గా మారి ఈ సొగసరి ఆశలన్నీ ఆవిరైపోయాయి. ప్రస్తుతం షాలిని చేతిలో 'మహారాజా' తప్ప సినిమాలేవీ లేవు. అయితే ఈ జబల్‌పూర్ జాణ తన గ్లామర్‌కు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తూ ఎప్పుడూ వార్తల్లో నిలిచేందుకు ప్రయత్నిస్తోంది. 'అర్జున్‌రెడ్డి' రోజులతో పోల్చితే చాలా స్లిమ్‌గా మారింది ఈ అమ్మడు. ట్రెండీ దుస్తుల్లో తన స్లిమ్ బాడీని ప్రదర్శించడానికి ఏమాత్రం వెనుకాడటంలేదు. తన ఫొటోషూట్స్ అందరికీ పంచుతూ అభిమానుల్లో వేడిని పుట్టిస్తోంది. ఇటీవల ఓ స్విమ్మింగ్ పూల్ క్లిక్‌తో అందరినీ ఆశ్చర్యపరిచింది. తన ఒంపుసొంపులన్నీ ఆరబోస్తూ ముద్దుగా ముఖం పెట్టిన ఈ భామ చూపుల వలలో దర్శక నిర్మాతలు చిక్కుతారా?.. అవకాశాలు ఇస్తారా వేచిచూడాలి!

# సరికొత్తగా ప్రజెంట్ చేశాను



నాగార్జున కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'నా సామిరంగ'. ప్రముఖ కొరియోగ్రాఫర్ విజయ్ బిన్ని దర్శకుడిగా పరిచయమవుతున్నారీ చిత్రంతో. కొరియోగ్రాఫర్‌గా తనదైన పేరు సంపాదించుకున్న విజయ్ బిన్ని డైరెక్టర్‌గా తన ప్రతిభను ప్రదర్శించేందుకు ఈ సినిమాతో ముందుకొస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో చిత్ర విశేషాలను పంచుకున్నారు. 'డైరెక్టర్ కావడం నా డ్రీమ్. 'నువ్వొస్తానంటే నేనొద్దంటానా' సినిమా చూశాక మొదట కొరియోగ్రఫీపై గ్రిప్ ఉండాలని పించి ఇన్నాళ్లు ఆగాను' అన్నారాయన. 'ఇంతకు ముందు నాగార్జున పాటలు చేశాను. అదే చొరవతో ఆయనకు కథ చెప్తే డైరెక్షన్ చేయమన్నారు. కమర్షియల్ పంథాలోనే నా స్టైల్ చూపించే ప్రయత్నించాను. దర్శకుడిగా తొలి సినిమా ఆయనతో చేయడం నా అదృష్టం. డిఫరెంట్‌గా నాగ్‌ను చూపించడంలో సక్సెస్ అయ్యానని భావిస్తున్నా' అని చెప్పుకొచ్చారు. 'అల్లరి నరేశ్‌కు నాగ్ అంటే పిచ్చి. ఇద్దరినీ ఈ ఫ్రెండ్షిప్ స్టోరీలో పెడితే బావుంటుందనిపించింది. మరో పాత్రకు యంగ్ యాక్టర్ కావాలని రాజ్‌తరుణ్‌ని తీసుకున్నాం. ముగ్గురి కథలూ ఎలా కనెక్ట్ అయి ఉన్నాయి? వాళ్ల మధ్య పరిస్థితులు ఏమిటనేది ఆసక్తికరం' అని వివరించారు. 'ఆర్టిస్టులు సపోర్ట్ చేస్తే సినిమా ఎంత త్వరగా పూర్తి చేయొచ్చో ఈ ప్రాజెక్టుతో నేర్చుకున్నాను. కీరవాణి గారు ఎప్పుడూ నన్ను కొత్త దర్శకుడిగా చూడలేదు. కొరియోగ్రఫీ నేపథ్యం ఉన్న నేను ఏదైనా చెప్తే ఓ సెన్స్‌తోనే చెప్తున్నారని భావించారు. ఏఎన్నార్‌ఆర్ గారి ప్రజాదరణ పొందిన పాటే టైటిల్ అయితే బావుంటుందని అందరం అనుకొని దాన్నే ఖరారు చేశాం' అని చెప్పారు. 'విజయ్, దినేష్ మాస్టర్ చెరో పాట చేయగా, మిగతా నాలుగు పాటలకు కొరియోగ్రఫీ చేశా. నిర్మాతలు చాలా సపోర్ట్ చేశారు. ఇక ముందు కూడా అన్ని జోనర్ సినిమాలూ చేయాలనుంది' అన్నారు విజయ్.

# థ్రిల్లర్ కథతో 'ముఖ్య గమనిక'



అల్లు అర్జున్ కజిన్ విరాన్ ముత్తంశెట్టి హీరోగా, సీనియర్ సినిమాటోగ్రాఫర్ వేణు మురళీధర్ దర్శకుడిగా పరిచయమవుతున్న సినిమా 'ముఖ్య గమనిక'. లావణ్య హీరోయిన్‌గా నటిస్తోంది. శివిన్ ప్రొడక్షన్స్ పతాకంపై ప్రొడక్షన్ నెం.1గా రాజశేఖర్, సాయికృష్ణ నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ సింగిల్ 'ఆ కళ్ల చూపుల్లోనా' పాటకు మంచి రెస్పాన్స్ వచ్చింది. తాజాగా శనివారం మూవీ టీజర్‌ను దర్శకుడు మారుతి విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మారుతి మాట్లాడుతూ 'థ్రిల్లర్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కిన ఈ కథ ఆసక్తికరంగా ఉంది. కానిస్టేబుల్‌గా విరాన్ క్యారెక్టర్ ఉత్కంఠను పంచింది' అన్నారు. సరికొత్త థ్రిల్లర్ కథ ఇదని దర్శకుడు తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: కిరణ్ వెన్న, నిర్మాతలు: రాజశేఖర్, సాయికృష్ణ, దర్శకత్వం: వేణు మురళీధర్.వి.